క్లుప్తంగా

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న వార్డు కార్పొరేటర్ లావణ్య, కోరమాండల్ అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కుంచమ్మకాలనీలో సామాజిక భవనం నిర్మాణానికి కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ సుమారు రూ.15 లక్షలు కేటాయించింది. దీంతో భవన నిర్మాణ పనులకు శనివారం వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి కోరమాండల్ సంస్థ సామాజిక భవనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ డీజీఎం రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ఎస్.వెంకటరమణ,ధర్మాల వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: ఆర్ఆర్‌వీపురం సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్న దృష్ట్యా సోమవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గోపాలపట్నం, టైలర్స్ కాలనీ, నరసింహనగర్, ఇందిరానగర్, లక్ష్మీనగర్, ప్రశాంతినగర్, శ్రీరామ్‌నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు, వుడాకాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

గోపాలపట్నం: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ 6న మర్రిపాలెం పెట్రోల్ బంక్ వద్ద అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆవ్యక్తిని కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆ వ్యక్తిని గుర్తించిన వారు ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

శ్రావ్యంగా గాత్ర కచేరి



కీర్తనలు ఆలపిస్తున్న రమ్య కిరణ్మయి

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ నెలవారి కార్యక్రమాల్లో భాగంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం రమ్య కిరణ్మయి గాత్ర కచేరి శ్రావ్యనందకరంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని సుసర్ల రామ్‌గోపాల్, రమ్య కిరణ్మయి, జగత్‌రాయ్‌లు ప్రారంభించారు. అనంతరం రాగాలాపన స్వరకల్పనతో రమ్య కిరణ్మయి అద్భుతంగా కీర్తలను ఆలపించారు. వయోలిన్‌పై హైదరాబాద్‌కు చెందిన దినకర్, మృందంగం సహకారం ఏడుకొండలు, ఘటంపై కౌండిన్య సహకరించారు.

లోక్ అదాలత్‌లో 1981 కేసుల పరిష్కారం

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1981 కేసులు పరిష్కారం అయ్యాయి. 13వ అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ ఆధ్వర్యంలో నాలుగు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం కేసులు రాజీ ద్వారా పరిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన సీనియర్ జడ్జి ఎస్.శ్రీవిద్య, 3వ ఎంఎంసీ ఇ.రాజేంద్రబాబు, 8వ ఏసీఎంఎం వై.శ్రీలక్ష్మి, జేసీజే ఎం.ప్రేమలత, ఏపీపీ వాణి, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.వి.స్వామి, బి.వి.ఎం.కృష్ణ, సీనియర్ న్యాయవాదులు జి.చిరంజీవి, ఎ.మురళీమోహన్, దేవి పాల్గొన్నారు.

జై భజరంగ భళి

- భక్తులకు కొండంత అండ ఆంజనేయుడు
- నేడు హనుమజ్జయంతి ఉత్సవాలు

ఆంజనేయుడంటే భక్తులకు కొండంత అండ. రెట్టించిన ధైర్యం. హనుమంతుడి గుండెల్లో శ్రీరామచంద్రుడు కొలువై ఉన్నట్టుగానే.. భక్తుల హృదయాల్లో భజరంగ భళి స్థానం పొందాడు. నాడు మహాభారత కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడి రథంపై 'జెండాపై కపిరాజులా' ఉంటూ విజయ తీరాలకు చేర్చిన హనుమంతుడు.. నేడు ప్రతి ఊరిలో వెలిసి భక్తుల పాలిట ఆపద్బాంధవుడిలా పూజలందుకుంటున్నాడు. ఆదివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని నగరంలో వెలసిన హనుమంతుని భారీ విగ్రహాల్లో కొన్నింటి విశిష్టత తెలుసుకుందాం.

– విశాఖపట్నం డెస్క్

సంజీవ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 30 అడుగులు, (గ్రౌండ్ లెవెల్ నుంచి 40 అడుగులు)
ప్రాంతం: హనుమంతవాక జంక్షన్
నిర్మాణ కర్తలు: జీవీఎంసీ
ప్రాముఖ్యత: విశాఖలో హనుమంతవాకకు ఎంతో ప్రత్యేకత, విశేష చరిత్ర ఉంది. నగరానికే తలమానికమైన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం కైలాసగిరి.. ఇక్కడి కొండ మీదే ఉంది. ఈ ప్రాంతానికి గుర్తింపుగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి సూచనల మేరకు జీవీఎంసీ ఈ విగ్రహాన్ని నిర్మిస్తోంది.
ప్రారంభం ఎప్పుడంటే..?: ఈ విగ్రహం నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు నెలల్లో పెయింటింగ్‌తో సహా మొత్తం పనులన్నీ పూర్తి చేసి ప్రారంభించనున్నారు.

అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 16 అడుగులు(గ్రౌండ్ లెవెల్ నుంచి 21 అడుగులు)
ప్రాంతం: జ్ఞానాపురం పాత లారీ స్టాండ్
నిర్మాణ కర్తలు: జ్ఞానాపురం పాత లారీ స్టాండ్ వర్తక సంఘం సభ్యులు
విగ్రహావిష్కరణ: 1990లో విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: లారీ స్టాండ్ డ్రైవర్లు సుదూర ప్రాంతాలకు వర్తక, వ్యాపారాల నిమిత్తం రాకపోకలు సాగించేటప్పుడు అభయాంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేసి బయలుదేరుతారు. తిరుగు ప్రయాణంలో వచ్చిన తర్వాత మళ్లీ ఆంజనేయ స్వామిని కొలుస్తారు. ప్రస్తుతం ఈ లారీ స్టాండ్‌ను షీలానగర్‌కు మార్చారు.

శ్రీ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 27 అడుగులు
ప్రాంతం: మెయిన్ రోడ్డు, పూర్ణామార్కెట్
నిర్మాణ కర్తలు: దేవాలయ నిధులు, దాతలు
విగ్రహావిష్కరణ: 2006లో నాటి ఎమ్మెల్యే దివంగత ద్రోణంరాజు శ్రీనివాస్ చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ప్రాంతంలో ఆంజనేయ స్వామి స్వయంగా వెలిశాడని ప్రతీతి. భక్తుల పాలిట కల్పతరువుగా స్వామి పూజలందుకుంటున్నాడు.

జింక్ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 45 అడుగులు
ప్రాంతం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద జింక్ స్థలంలో..
నిర్మాణ కర్తలు: దేవదాయ శాఖ
విగ్రహావిష్కరణ: ఈ విగ్రహాన్ని 2006లో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి తండ్రి తిప్పల దయాల్‌రెడ్డి ఆవిష్కరించారు
ప్రాముఖ్యత : పారిశ్రామిక ప్రాంతంలో ఇదే ఎత్తయిన హనుమంతుడి విగ్రహం. గాజువాక ఆర్టీసీ డిపో ప్రాంతంలో ఆలయ నిర్మాణానికి ముందు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగేవని.. ఆలయాన్ని నిర్మించి ప్రారంభించిన అనంతరం ప్రమాదాలు తగ్గాయని భక్తులు చెబుతున్నారు.

అభయ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 108 అడుగులు
ప్రాంతం: సీతమ్మధార కొండవాలు
నిర్మాణ కర్తలు: శ్రీ హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి సత్యనారాయణరాజు (ఎ.ఎస్.ఎన్.రాజు), దాతలు
విగ్రహావిష్కరణ: 2021 డిసెంబర్ 8న పెందుర్తి శారదా పీఠాధిపతి స్వరూప నందేంద్ర సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: సీతమ్మధార కొండవాలు ప్రాంతంలోని సువిశాల సుందర ప్రదేశంలో నిర్మించిన 108 అడుగుల ఈ భారీ ఆంజనేయ విగ్రహం విశాఖలోనే అత్యంత పెద్దది.. ఎత్తయినది. ఆధ్యాత్మికంగా నగరానికి వన్నెతెచ్చింది.

మాతాభయ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 28 అడుగులు
ప్రాంతం: ఓల్డ్ డైరీ ఫారం జంక్షన్
నిర్మాణ కర్తలు: మాతాభయ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ పెద్ద, ధర్మకర్త బోను సత్యనారాయణ
విగ్రహావిష్కరణ: 2006లో ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: జాతీయ రహదారిపై పాత డైరీ ఫారం జంక్షన్‌లో వెలసిన మాతాభయ ఆంజనేయుడు భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నాడు. విగ్రహ నిర్మాణంతో ఈ ప్రాంతానికి ఎంతో గుర్తింపు వచ్చింది. ఇక్కడి స్వామిని కనులారా దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. చక్కని వాతావరణంలో ఆధ్యాత్మికతతో ఈ ప్రాంతం నిండి ఉంటుంది.

సుందర అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 46 అడుగులు(గ్రౌండ్ లెవెల్ నుంచి 57 అడుగులు)
ప్రాంతం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి
నిర్మాణ కర్తలు: ఆలయ కమిటీ సభ్యులు
విగ్రహావిష్కరణ: 1996 మార్చి 7న నాటి మాజీ ఎమ్మెల్యే, వుడా మాజీ చైర్మన్ దివంగత టి.సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: సుందర అభయాంజనేయ స్వామి భారీ విగ్రహ నిర్మాణాన్ని 1991లో పెద్దాపురం ప్రాంతానికి చెందిన పిండి కృష్ణ అనే శిల్పి ప్రారంభించారు. మరుసటి ఏడాది ఆయన మరణించడంతో ఆ బాధ్యతను ఆయన అల్లుడు రాజ్‌కుమార్ తీసుకుని భారీ విగ్రహం, ఆలయ నిర్మాణాలను పూర్తి చేశారు. నాడు నిర్మానుష్యంగా ఉండే తాటిచెట్లపాలెం ప్రాంతంలో ఆధ్యాత్మికంగా వెలుగొందేలా.. ఓ ల్యాండ్ మార్క్‌లా నిలిచేలా ఈ విగ్రహాన్ని నిర్మించారు. ఎందరో భక్తులు ఇక్కడికి తరలివచ్చి అంజన్నను తిలకించి తరిస్తుంటారు.

శుభ కార్యాలు.. మైదానాలే వేదికలు!

- పరిసరాలు అపరిశుభ్రం
- ఇబ్బంది పడుతున్న వాకర్స్, క్రీడాకారులు
- నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



మైదానంలో భోజనాలు అనంతరం విడిచిపెట్టిన వ్యర్థాలు



మైదానంలో అడ్డంగా వేసిన స్టేజ్ సామగ్రి

మల్కాపురం: ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఏర్పాటు చేసిన క్రీడామైదానాలు కల్యాణ మండపాలుగా మారుతున్నాయి. దీంతో మైదానాలకు వచ్చే క్రీడాకారులు, వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు.మైదానానికి ఆనుకుని ఉన్న వారి ఇళ్లలో ఏ శుభ, అశుభకార్యాలు జరిగినా మైదానాలే వేదికలవుతున్నాయి. దీంతో మైదానానికి వచ్చే వారు అసౌకర్యానికి గురవుతున్నారు. అనధికారికంగా మైదానాల్లో వేడుకలు నిర్వహిస్తున్న వారిపై అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని వాకర్స్,క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీలోని సెయింట్ ఆన్స్ ఆస్పత్రి సమీపంలో జీవీఎంసీకి చెందిన మైదానం ఉంది. ఐదేళ్ల కిందట దీన్ని వాకింగ్ చేసుకునేందుకు, మినీ జిమ్,బ్యాడ్మింటన్‌తో పాటు క్రికెట్ ఆడుకునే విధంగా తీర్చిదిద్దారు. క్రీడాకారులు,వాకర్స్ కోసం మంచినీటి సదుపాయంతో పాటు విశ్రమించేందుకు బల్లలు,మైదానం ప్రాంగణంలో పచ్చటి మొక్కలు ఏర్పాటు చేశారు.దీంతో ఇందిరాకాలనీ వాసులతో పాటు జవహర్‌నగర్, ప్రకాష్‌నగర్,ఇండస్ట్రియల్‌కాలనీ,జనతాకాలనీ తదితర ప్రాంతాల వారు రోజూ ఇక్కడకు వచ్చి వ్యాయామం, వాకింగ్,ఆటలు ఆడుతుంటారు. అయితే కొంత మైదానాన్ని ఫంక్షన్లకు వినియోగిస్తున్నారు. పెద్ద సెట్‌లు వేసి రోజుల తరబడి తీయకుండా నిర్లక్ష్యంగా విడిచిపెడుతున్నారు. వాస్తవానికి జీవీఎంసీకి చెందిన ప్రదేశంలో ఎవరైనా కార్యాలు చేయాలనుకుంటే అధికారుల అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలి. కానీ స్థానిక నాయకులను అడ్డుపెట్టుకుని అనుమతులు లేకుండానే కార్యాలు చేస్తున్నారు. గురు,శుక్ర వారాల్లో మైదానంలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు కార్యాలు చేసుకున్నారు. తిని పడేసిన ప్లేట్లు, ఇతర వ్యర్థాలు మైదానంలో నిర్లక్ష్యంగా విడిచిపెట్టారు. దీంతో శనివారం మైదానానికి వచ్చిన తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

మైదానం అంతా చెడు వాసన



ఇక్కడ ఎవరో శుభకార్యం చేసుకున్నారు. పెళ్లికి అవసరమైన భారీ సెట్ ఇక్కడ వేసి ఆ సెట్ సామగ్రి తొలిగించకుండా నిర్లక్ష్యంగా విడిచిపెట్టారు. భోజనం వ్యర్థాలను ఇక్కడ విడిచిపెట్టారు.దీంతో మైదానం ప్రాంగణంలో చెడు వాసన వస్తోంది.అసౌకర్యం ఉంది.

– మురళీయాదవ్, వాకర్, స్థానికవాసి

అధికారులు చర్యలు తీసుకోవాలి



క్రీడామైదానాల్లో అనుమతులు లేకుండా శుభకార్యాలు చేసుకోవటం బాధాకరం. క్రీడామైదానాలు క్రీడాకారులు ఆడుకోవడానికే తప్పా,కార్యాల కోసం కాదు.అధికారులు ఇలాంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాలి. లేకుంటే దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– రమేష్, క్రీడాకారుడు, ప్రకాష్‌నగర్

పెంటమాంబ.. చల్లగ చూడమ్మా

భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన



అమ్మవారి పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు,భక్తులు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్ గ్రామదేవత పెంటమాంబ అమ్మవారి పూజలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ నెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం పండితుడు ఎస్.ఎస్.వి ప్రసాద్‌శర్మ సారథ్యంలో లక్ష కుంకుమార్చన పూజ లు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళ లు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన మజ్జి గౌరమ్మ,చింతలమ తల్లికి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11వ తేదీ నుండి ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు,అర్చనలు,అభిషేకాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆదివారం కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని, ముగింపు రోజు సోమవారం అమ్మవారి పేరు మీద పరస నిర్వహణ, కోలాట ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఉంటుందన్నారు. గ్రామస్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని గాంధీగ్రామం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో శనివారం చిన్నారులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నెండి వచ్చే నెల 11వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చిన్నారులకు కథలు, కథనాలు, వ్యాసరచన పోటీలు, ఆటలు, పాటలు మొదలైన వాటిపై వలంటీర్ల సహకారంతో శిక్షణ ఇస్తున్నారు. ప్రతి శనివారం వీటిపై పోటీలను నిర్వహించి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు



సింహగిరిపై భక్తుల రద్దీ

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల, దర్శనం క్యూలు కిక్కిరిశాయి. మధ్యాహ్నం రాజభోగం సమయంలో భక్తుల క్యూలు బారులు తీరాయి. దేవస్థానం బస్సులు, ఆర్టీసీ బస్సులురద్దీగా మారాయి.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పురోహిత్ అలంకారి కరిసీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

లారీ క్లీనర్ అదృశ్యం



విజయకుమార్

పరవాడ: లంకెలపాలెం సంతోష్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద లారీలో పడుకున్న క్లీనర్ ఎం.విజయ్‌కుమార్ కనిపించడం లేదని లారీ డ్రైవర్ శాంతరాజు పరవాడ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన క్లీనర్ విజయ్‌కుమార్ చీరాల జిల్లా బాపట్ల ప్రసాద్‌నగర్‌కు చెందిన వ్యక్తిగా పేర్కొన్నాడు. వివరాలిలా ఉన్నాయి.....ఈ నెల 6న గుంటూరు జిల్లా నరసారావుపేటలో ఉదయం 8.30 గంటలకు గేదెల దాణా లోడుతో డ్రైవర్ శాంతరాజు, క్లీనర్ విజయకుమార్ బయలుదేరి సబ్బవరం, ఆనందపురం ప్రాంతాల్లో అన్‌లోడ్ చేశారు. తిరిగి ఈ నెల 8వతేదీ సాయంత్రం లంకెలపాలెం సంతోష్ ట్రాన్స్‌పోర్టుకు చేరి లోడు ఏమీ లేకపోవడంతో రాత్రికి అక్కడే పడుకున్నారు. మరుసటి రోజు కూడా లోడు లేని కారణంగా డ్రైవర్ ఆఫీసులో పడుకోగా క్లీనర్ లారీలో పడుకున్నాడు. ఉదయం డ్రైవర్ శాంతరాజు లేచి చూడగా క్లీనర్ కనిపించలేదని డ్రైవర్ పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విజయ్‌కుమార్ ఆచూకీ తెలిసిన వారు పరవాడ సీఐ ఈశ్వర్‌రావు 9440796038 నంబర్‌కు సమాచారం అందించాలని స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కోరారు.

బీజేపీపై వ్యతిరేకతకు కర్ణాటక ఫలితాలే నిదర్శనం

కూర్మన్నపాలెం: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కర్ణాటక ప్రజలు తమ వ్యతిరేకతను తెలియజేశారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దక్షిణ భారతదేశంలో బీజేపీ ప్రభుత్వానికి మద్దతిస్తున్న ఏకైక రాష్ట్రమైన కర్ణాటకలో బీజేపీ తన అధికారాన్ని కోల్పోవడమే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 821వ రోజు ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ విభాగాల కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. దేశంలో మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకించడం ద్వారా ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోగలమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.